

హెచ్ఎం నాగేశ్వరరావుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి హుకుంపేట:యువ తేజం, కలం ట్రస్ట్ (తిరుపతి) విశ్వం విద్యా సంస్థల్లో ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారాన్ని హుకుంపేట మండలం కొంతిలి గ్రామానికి చెందిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1 ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు అదివారం అందుకున్నారు. ఈ మేరకు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కా రాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు జి సుబ్రహ్మణ్యం శర్మ, నారాయణస్వామి, కరీముల్లా చేతుల మీదుగా అందుకున్నట్లు ఆయన వివరించారు. నాగేశ్వరరావుకు ఉపాధ్యాయులు చెండా బాలకృష్ణ, ఎంవి నాయుడు, చక్రధర్, మందన్న, విశ్వనాథం, రవి కుమార్, రామకృష్ణ, బాలన్న, చిరంజీవి, సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు.


అవార్డును ఇస్తున్న అతిథులు

పశుసంవర్థక శాఖ స్థలంలో నిర్మిస్తున్న

అక్రమ కట్టడాలను నిలిపేయాలి

-ఐటిడిఎ నిధులతో నిర్మించి నిరుద్యోగులకు కేటాయించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర


కట్టడాన్ని పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండల కేంద్రంలోని అక్షయ ఇన్ లాడ్జి పక్కన పశుసంవర్ధక శాఖ స్థలంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అక్రమ కట్టడాలను నిలుపుదల చేసి, ఐటీడీఏ నిధులతో నిర్మించి స్థానిక నిరుద్యోగులకు షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. ఆదివారం అరకులోయ మండల కేంద్రంలోని జరుగుతున్న అక్రమ కట్టడాలపై ఆదివాసీ గిరిజన సంఘం బృందం పర్యటన చేసి పరిశీలించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, పశుసంవర్ధక శాఖ కు సంబందించిన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ సలాన్ని ఐటిడిఏ స్వాధీనం చేసుకొని ఐటిడిఏ నిధుల ద్వారా నిర్మాణం చేసి స్థానిక గిరిజన నిరుద్యోగులకు షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించాని డిమాండ్ చేశారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పంచాయతీ పాలకులు ఏ డబ్బులతో నిర్మాణం చేస్తున్నారో తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పెదలబుడు పంచాయతీ పరిధిలో గ్రామంలో డ్రైనేజ్, సిసి రోడ్డు, తాగునీరు, వీధిలైట్లు నిధులు లేవని చెప్పిన పాలకులు ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా గిరిజనేతరుడైన కాపుగంటి కృష్ణారావు నిర్మిస్తున్న భారీ సిమెంట్ గొడౌన్ అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టి నిలుపుదల చేయాలన్నారు. 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ అతిక్రమించి గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు.గిరిజన చట్టాలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న గిరిజనేతరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అక్రమ కట్టడాల నిర్మాణనికి సహకరించిన సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, మండల అధ్యక్ష కార్యదర్శిలు గత్తుం బుజ్జి బాబు, గెమ్మెల చిన్నబాబు, మండల నాయకులు కె జగన్నాధం, కె మగ్గన్న,టి జోషి,జొయో పాల్గొన్నారు.

సరియా జలపాతంలో మృతదేహాలు లభ్యం


మృతదేహాలను బయటకు తీసుకొస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని సరియా జలపాతంలో గల్లంతైన మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతాన్ని తిలగించేందుకు శనివారం పర్యాటకులు వెళ్లి గల్లంతైన విషయం తెలిసింది.అనంతగిరి ఎస్సై కరకా రాము, ఉప తహసిల్దార్ మాణిక్యం, దేవరాపల్లి ఎస్సై మల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో ఆదివారం గాలింపు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరం ప్రాంతానికి చెందిన ఇండియన్ నేవీ ఉద్యోగి సాయికుమార్, బీహార్ రాష్ట్రం బడ్జెట్‌పూల్‌మహాలికి చెందిన దినేష్ కుమార్ మృతదేహాలను గుర్తించామని ఎస్సైలు పేర్కొన్నారు.

జలపాతాల వద్ద భద్రతా చర్యలు చేపట్టండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలోని జలపాతాల వద్ద ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. శనివారం అనంతగిరి మండలం సిరియా జలపాతం వద్ద జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్ పోలీస్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతగిరి మండలం సరియా జలపాతం, డుంబ్రిగూడ మండలం చాపరాయి, పెదబయలు మండలం పిట్టల బొర్ర, కొయ్యూరు గాదిగుమ్మి, చింతపల్లి ఎర్రవరం, జీకే వీధి ధోని గుమ్మల, హుకుంపేట మండలం సువ్వపాడు, రంపచోడవరం జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలపై పర్యాటకులను చైతన్యవంతం చేయాలని చెప్పారు..

ఏజెన్సీలో కొత్త కూర పండగ


కొత్త ఆకు కూర ఇదే...

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఏజెన్సీలో గుమ్మడి కూర పండగ ఆగస్టు నెల చివరి నుంచి ప్రారంభమైంది. ఈ పండుగ ఈనెలలో కూడా జరుపుకుంటారు. గుమ్మడి కూర పండినప్పటి నుంచి ఏజెన్సీలో కొత్తకూర పండగను గిరిజనులు జరుపుకుంటారు. గుమ్మడికాయతో పాటు గుమ్మడి ఆకులను వంట చేసి గిరిజన సంప్రదాయపద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ కూరను కుటుంబీకులకు అందరికీ పంచి పెడతారు. ఈ కొత్త కూర (నువ్వా మారో) పండగ చేయకుండా గిరిజనులు ఎవరు కూడా గుమ్మడి ఆకుకూరలను వండి తినరు. ఒకవేళ గిరిజన సంప్రదాయానికి వ్యతిరేకంగా వండి తిన్నప్పటికీ కుటుంబంలో ఏదో కీడు జరుగుతుందనే సంకేతం వారి ఉంటుంది. దీంతో ఏజెన్సీలో సంప్రదాయ బద్ధంగా గ్రామ పెద్దలు పూర్వకాలం నుంచి అనుసరిస్తున్న పద్ధతిని ప్రస్తుతం గిరిజనులు పాటిస్తున్నారు. గుమ్మడి, గుమ్మడి ఆకుకూరకు ఏజెన్సీలో మంచి గిరాకీ ఉంది. ఈ గుమ్మడి ఆకుకూరలను ఎగబడుకుంటూ కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో పాటు మైదాన ప్రాంత వాసులు కూడా వారపు సంతలోకొచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు.

ఏజెన్సీలో వరి నాట్లు పూర్తయిన తర్వాత బోల్ల ఆకులను పంట పొలాల్లో వేస్తారు. దీంతో ఆ ఏడాది వ్యవసాయ పంటల సాగు పూర్తయినట్టు గిరిజనులు భావిస్తారు. బోల్ల ఆకులను వరి పంట పొలాల్లో నాటిన తర్వాత ఈ ఏడాది వరి నాట్లు పూర్తయినట్లు గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా భావించుకుంటారు. దీంతో ప్రతి ఏడాది గుమ్మడి ఆకుకూర పంటకు ప్రత్యేకత ఉంటుంది.

పాఠశాలల సౌకర్యాలపై నివేదిక అందించండి

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని సౌకర్యాలపై నివేదికను అందించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆదేశించారు. మండలంలోని జాంగుడ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆయన సందర్శించారు. ఇటీవల కలుషిత ఆహారంతో ఆసుపత్రిలో చేరి కోలుకుని పాఠశాలకు చేరుకున్న బాధిత విద్యార్థినిలను పరామర్శించారు. పాఠశాలలో చుట్టూ పరిసరాలను పరిశీలించారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటుమటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకునే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థినిలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలపై తుది నివేదికను తక్షణమే అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజారావు, సర్పంచి కొములు, ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

పంట నష్టాల అంచనాలో అలసత్వం దారుణం

● వరి, మిరప పంట నష్టాలను పరిశీలించిన సిపిఎం బృందం


ధర్మతాల గూడెంలో కుళ్లిపోయిన మిర్చి పొలాలను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం: పంటనష్టాల అంచనాల్లో ప్రభుత్వ యంత్రాంగం అలసత్వం, నిర్లక్ష్యం ధోరణి వ్యవహరించడంపై సిపిఎం నేతలు మండిపడ్డారు. గోదావరి, శబరి నదులు ఉప్పొంగడంతో ముంపుబారిన పడి కుళ్లిపోయిన వరి, మిరప పంట పొలాలను ఆదివారం ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యంలో సిపిఎం బృందం పరిశీలించింది. గుణకొండ, ధర్మతాల గూడెం గ్రామంలోని తెలగాని వెంకన్న మిర్చి పొలాలు,నారుమళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దాదాపు 15రోజులపాటు నీటి ముంపులోనే పైర్లు ఉండడంతో కుళ్లి పాడయ్యాయని బాధిత రైతులు సిపిఎం నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం. జిల్లా నాయకులు పూనం. సత్యనారాయణ మాట్లాడుతూ, రెండునెలల్లో అధిక వర్షాలు, గోదారి, శబరి నదుల వరదలో పంటపొలాలన్నీ ముంపుబారిన పడి, కుళ్లి పాడైపోయినా ఇంతవరకు సంబంధిత వ్యవసాయశాఖ, ఇతర అధికారులు పరిశీలనకు రాకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పంటనష్టాలపై సర్వేచేసి, అంచనా నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంకు సత్తిబాబు సోడి. మల్లయ్య, కారం. సుందరయ్య పాల్గొన్నారు.

ఎం.రుషికొండ వైపు కన్నెత్తి చూడరా..?


బండరాళ్లు, మట్టి పేరుకుపోవడంతో రూపు కోల్పోయిన పంట పొలం


స్వచ్ఛందంగా రోడ్డు క్లియర్ చేసుకుంటున్న ఎం.రుషికొండ గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు: భారీ వర్షాలు, కొండ చరియల విలయంతో పూర్తిగా నష్టపోయిన జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ ఎం.రుషికొండ వైపు వారం రోజులు గడిచినా అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి లేదని గ్రామస్తులుఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 8న రాత్రి కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడడంతో పంటపొలాలు, రహదారులపైకి నాలుగు అడుగుల మేర మట్టితోపాటు భారీ బండరాళ్లు వచ్చి పడడంతో ఏకంగా రూపు కోల్పోయి తీరని నష్టం జరిగిందని అంటున్నారు. పంటపొలాలన్నీ మట్టి దిబ్బలుగా మారడంతో పాటు, రోడ్డుపైకి భారీ బండరాళ్లు పడడంతో అంతా అస్తవ్యస్తమైందని ఆవేదన వెలిబుచ్చారు. ఇంతజరిగినా తమ గ్రామంవైపు అధికారులుగానీ, నేతలుగానీ కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. ఎవరి పొలం ఎక్కడుందో గుర్తించలేని విధంగా మొత్తం మట్టిదిబ్బలుగా మారిందని, ఇక పంటలన్నీ నామరూపాల్లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై పడిన బండరాళ్లను తొలగించే దుస్థితి తమకు పట్టిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, తమ గ్రామంలో పంట, ఇతరత్రా ఆస్తుల నష్టాలపై సర్వే చేయించి,బాధితులైన తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి


కొత్తగా ఎన్నికైన వాలంటీర్ల సంఘం మండల కార్యవర్గం

ప్రజాశక్తి- చింతూరు : గ్రామ వార్డు వాలంటీర్లను కొనసాగించి,వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు.ఆదివారం ఎపి గ్రామ వార్డ్ వాలంటీర్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ అధ్యక్షతన ఎర్రంపేట ఎఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామ.వార్డ్ వాలంటీర్లకు నెలకు రూ. 10వేలు వేతనం ఇస్తామన్న హామీని నెరవేర్చాలని.ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలవంతంగా రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి వీధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్ల విధి విధానాలపై.జాబ్ చార్ట్ ప్రకటించాలన్నారు. . రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రంగా ఉందని, కేవలం రూ.ఐదు వేలు గౌరవ వేతనంతో పనిచేసేందుకు పిజిలు, ప్రొఫెషనల్ కోర్సులు చేసిన నిరుద్యోగులు పోటీ పడుతున్నారన్నారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు సాదులు రామిరెడ్డి, జోడి దుర్గారావు, పొడియం దన్న, సోడి లక్ష్మి. సీత. పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

ఎపి గ్రామ వార్డ్ వాలంటీర్లయూనియన్, సిఐటియు అనుబంధ సంఘం చింతూరు మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని 27 మందితో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పొడియం బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కలుముల మహేష్, కోశాధికారి సోడి దుర్గారావు, గౌరవ అధ్యక్షులు పొడియం లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీలు. సవలం సుకన్య.. సవలం ఉదయ్, వైస్ ప్రెసిడెంట్లు కట్టాం సింగయ్య. డి. కవిత, రాష్ట్ర కమిటీ సభ్యులు.పొడియం జానీ తదితరులు పాల్గొన్నారు

ఎట్టకేలకు విద్యుత్ పునరుద్ధరణ


నాటుపడవలపై విద్యుత్ వైర్లు తీసుకెళుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: దుప్పిలివాడ పంచాయతీలోని పలు గ్రామాల్లో విద్యుత్తు పునరుద్ధరణ పనులు గ్రామస్తుల సహకారంతో శని ఆదివారాల్లో పూర్తిచేశారు. గత ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షాలకు దుప్పులవాడ పంచాయతీ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, విద్యుత్ వైర్లు తెగి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో వారంరోజులుగా ప్రజలు అంధకారంలో మగ్గిపోయారు. సీలేరు దారకొండ మధ్య రహదారిలో కొండచరియలు విరిగిపడి, రాకపోకలకు వీలులేని పరిస్థితుల్లో విద్యుత్ పునరుద్ధరణకు వీలు లేకుండా పోయింది. అధికారుల చొరవతో రోడ్డు క్లియర్ కావడంతో ఇపిడిసిఎల్ సిబ్బపిల్లి గెడ్డ కాట్రగెడ్డ జొన్న మామిడి సంత నేరేడుపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టారు. వివిధ గ్రామాల్లో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాల వైర్లు చోరీకి గురి కావడంతో దారకొండ సబ్ స్టేషన్ నుంచి నూతనంగా విద్యుత్ వైర్లను తీసుకొచ్చారు. పిల్లిగెడ్డ నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో నాటు పడవలపై విద్యుత్‌వైర్లను వాగు దాటించి తీసుకొచ్చి, సరిహద్దులో ఉన్న పిల్లిగెడ్డ కాట్రగెడ్డలో నేలకొరిగిన స్తంభాలను, సరిచేసి విద్యుత్ వైర్లు అమర్చి విద్యుత్తు పునరుద్ధరణ చేశారు.

సీతారాం ఏచూరికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఎపి జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆదివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె.సుబాన్, చింతా రాంబాబు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరిమరణం సిపిఎం పార్టీకి తీరంలోటన్నారు. విలువలతో కూడిన రాజకీయ మహానేతగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికబ్రాంచ్ సిఐటియు అధ్యక్షులు బి. లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్, ఎపి జెన్‌కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

15 నెలలుగా అందని వేతనాలు

● సత్యసాయి నీటిపథకం సిబ్బంది అవస్థలు

● జీతం బకాయి చెల్లించుకుంటే 17న ధర్నా

ప్రజాశక్తి -దేవీపట్నం: 15నెలలుగా వేతనాలు అందక కుటుంబపోషణకు నానా ఇబ్బందులు పడుతున్నామని సత్యసాయి మంచినీటి పథకం సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి ట్రస్ట్ నెలకొల్పిన ఈ పథకంలో అరకొర జీతాలతో పనిచేస్తున్న సిబ్బందికి దాదాపు 15నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. సంబంధించిన అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకొన లాభం లేకపోయిందని సత్యసాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడుగుతుంటే, సంబంధిత కాంట్రాక్టర్లను అడగమని చెప్తున్నారని, కాంట్రాక్టర్ అడిగితే, ప్రభుత్వం నుంచి బిల్లు ఇస్తే చెల్లిస్తామని చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వేతన బకాయి చెల్లించకుంటే ఈనెల 17న మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కట్టుమూరు వీరబాబు హెచ్చరించారు.



ఎస్ఐ సురేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా ఎల్ సురేష్ గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట పోలీస్ స్టేషన్ లో పని చేసి సాధారణ బదిలీలో బాగంగా హుకుంపేట మండలానికి వచ్చారు. హుకుంపేటలో పని చేసిన ఎస్ఐ సతీష్ అనకాపల్లి జిల్లా చీడికాడ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.

సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని డోకులూరు ఆశ్రమ పాఠశాలలో నూతనంగా నెలకొల్పిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహ దాత మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్ విగ్రహాన్ని స్కూల్ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. స్కూల్ హెడ్మాస్టర్ బాబురావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత , విశ్రాంత కలెక్టర్ డాక్టర్ తమర్బ బాబురావు నాయుడు, కొట్టగుల్లి సింహాచలం నాయుడు, గ్రామ పెద్దలు, గిరిజన సంక్షేమ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రజిని, ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు ఉప్పల వెంకటరత్నం, దేసిది బాబురావు, రాజబాబు సిద్ధనాతి కొండలరావు, కొట్టగుల్లి రామారావు, రవి, శివరాత్రి శ్రీనివాస్, సిద్ధనాతి కొండలరావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండల కేంద్రంలో స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేపట్టారు. మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఊరేగింపు చేస్తూ, చాపరాయి జలపాతం వరకు గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యం ప్రదర్శిస్తూ గిరిజనులు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. అల్లూరి యూత్ నాయకులు సూర్య ప్రకాష్, నవసూర్య, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ శరభగూడ గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి.ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. గిరిజన సాంప్రదాయ బద్ధంగా కోలాటం, భక్తి పాటలకు చిన్న పిల్లలు డాన్స్, థింసా నృత్యాలు వంటి కార్యక్రమాలు అలరించారు. రేపు వినాయకుడు నిమజ్జనం కార్యక్రమంలో భక్తులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కె ఆనంద్, కె మోహన్, పి.కళ్యాణ్, జె కళ్యాణ్, గణేష్, ప్రవీణ్, కే.సువర్ణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో..

వారానికి మూడు రోజులు అన్నసమారాధన

ప్రజాశక్తి-పాడేరు:మోదకొండ అమ్మవారి ఆలయంలో ఇకనుంచి వారానికి మూడు రోజుల పాటు మోదకొండమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు తొలిసారి పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి ఈ అన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ తండ్రి విజయ కుమార్ పాల్గొన్నారు. వారంలో అమ్మవారి ఆలయానికి భక్తుల ఎక్కువగా వచ్చే ఉండే మూడు రోజులు అనగా ప్రతి మంగళవారం, శుక్రవారం, ఆదివారం జరిగే ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని పాడేరు పంచాయతీ ప్రెసిడెంట్ ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బోనంగి రమణ, సల్ల రామకృష్ణ, ఉడా త్రినాథ్, కొణతాల సతీష్, గబలంగి శంకర్రావు, గూడెపు ప్రకాష్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జిల్లాలో వైద్య విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు ఎల్వి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సీపట్నం ఏ రియా వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు అడిగితే... బిల్లులు రాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, సోమేశ్వరరావు, పార్వతి, దుర్గా, లక్ష్మి, రాము, పద్మ, మల్లేశ్వరి, కమల, వర లక్ష్మి,లావణ్య, దేవి పాల్గొన్నారు.

సన్యాసిరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు, రచయిత, గాయకుడు కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు(74) మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఆదివారం ఆదివాసి గిరిజన సంఘం, సిఐటియు, ప్రజానాట్య మండలి నాయకులు గంగిరెడ్డి సన్యాసిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాల పాటల గాయకుడు చనిపోవడం ఉద్యమానికి తీరనిలోటని, ఆయన మన మధ్య ఇక లేకపోవడం చాలా బాధాకరమన్నారు.ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం అరకు మండల కార్యదర్శి జి బుజ్జి బాబు, సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు, ప్రజానాట్య మండలి నాయకులు టి జోషి, తదితరులు పాల్గొన్నారు.



సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

17న నక్కపల్లిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలి

ప్రజాశక్తి - నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి అనకాపల్లి కలెక్టరేట్ లో ఈనెల 17న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారని, అలాకాకుండా నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, చందనాడ సర్పంచ్ భర్త తళ్ల భార్గవ్, ఎంపిటిసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నిర్వాసితులు కోరారు. చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో ఆదివారం సాయంత్రం నిర్వాసితులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి భూముల కోల్పోయిన రైతులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వివిధ వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించవలసి ఉందన్నారు. నిర్వాసితులను ఏ విధంగా ఆదుకుంటారో ,పునరావాసం ఎక్కడ కల్పిస్తారో, ఆర్అండ్ ప్యాకేజీ, 18 సంవత్సరాలు నిండిన వారికి ఏ విధంగా ప్యాకేజీ చెల్లిస్తారో, కటాఫ్ తేదీ ఏ విధంగా ప్రకటిస్తారో, ఇంకా పరిహారం చెల్లించని డి ఫారం, సాగుదారుల సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో వీటన్నిటికీ అధికారులు సమాధానం చెప్పవలసి ఉందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపట్టడం సరికాదన్నారు.17 జరుగు ప్రత్యేక గ్రీవెన్స్ లో రాష్ట్ర హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరవుతారని, సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక తహసీల్దార్ చెప్పడం జరిగిందన్నారు.స్థానిక నిర్వాసితులు అనకాపల్లి వెళ్లడం కష్టతరమని, ఈ మేరకు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుచేసి, నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి మన బాల రాజేష్, నాయకులు సూరకాసుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం బైక్ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 16 పాయకరావుపేట నుండి అచ్యుతాపురం వరకు చేపట్టే సిపిఎం బైకు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. ఆదివారం సిపిఎం బైక్ యాత్ర పోస్టర్ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ఫార్మా సేజ్‌లలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ప్రమాదాలను అరికట్టాలని, సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలన్నారు. కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కంపెనీల యాజమాన్యాలు ప్రమాణాలు పాటించక పోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో రామచంద్రపురం శివారు గిరిజన గ్రామమైన అలుముయ్యపాలెం గ్రామంలో పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాలను గుడిలో నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకొని దాదాపు నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, దీంతో బడిని గుడిలో నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అలుముయ్య పాలెం పాఠశాలను గెడ్డకు అవతల వైపు నిర్మించారు. అక్కడ కూడా రెండేళ్ల పాటు నడిపిన తర్వాత సమీపంలో గల ఆంజనేయస్వామి గుడి పెట్టు కింద నిర్వహించారు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గెడ్డకు అవతలకి వెళ్లేందుకు, వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గెడ్డకు ఇవతల వైపున రామమందిరంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. గతంలో 18 మంది వరకు విద్యార్థులు చదువుకునే వారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. గిరిజన గ్రామానికి గత ప్రభుత్వం 3.30 కోట్లతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారని, అది కూడా అసంపూర్తిగా మిగిలి పోవడంతో గెడ్డలో వంతెన నిర్మాణం చేపట్టకుండా వదిలివేయడంతో గ్రామస్తులు విద్యార్థులు గెడ్డ అవతలికి వెళ్లేందుకు వచ్చేందుకు గిరిజనులు కొండకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. 15 సంవత్సరాల క్రితం ఇక్కడ గెడ్డలో నిర్మించిన కల్వర్టు గెడ్డ ఉధృతికి ధ్వంసం అయ్యిందని కొంతవరకు రోడ్డు వేయించి వదిలేశారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామంలో పాఠశాల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్లో పాత నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దిశ ఎసిపి సిహెచ్.పెంటారావు తెలిపారు. పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా మోడివలసకు చెందిన ఎర్నింటి కృష్ణబాబు ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు కోసం దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. అతనిపై భీమిలి పోలీస్ స్టేషన్లో 5, ఆనందపురం, పద్మనాభం, పిఎం.పాలెం, డెంకాడ, విజయనగరం పోలీస్ స్టేషన్లలో ఒకొక్క కేసు నమోదై ఉన్నాయని వివరించారు. ఈ సంవత్సరం మార్చి నెలలో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంటి దొంగతనం కేసులో జైలుకు వెళ్లి ఆగస్టులో విడుదలై బయటకు వచ్చినట్లు తెలిపారు. జైలులో పరిచయమైనకోనాడ రాంబాబుతో కలిసి ఆరిలోవ ప్రాంతంలో యమహా బైక్‌ను దొంగతనం చేశారని పేర్కొన్నారు. తరువాత ట్రెంచ్ మెరైన్ అపార్ట్‌మెంట్, రుషికొండలో నాలుగు మొబైల్ ఫోన్లు, విజయనగరం పరిధిలో ఒక హీరో బైక్, ఆనందపురం, ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద ఒక పల్సర్ బైక్‌ను దొంగతనం చేశాడని, వాటిని వెంటనే అమ్మితే పోలీసులకు పట్టుబడతామని భావించి కొమ్మాది శివారు దేవి మెట్ల వద్ద ఒక పాడుబడిన రేకుల షెడ్డులో ఉంచాడని తెలిపారు. నిందితుడు స్నేహితుడు కోనాడ రాంబాబు ఇచ్చిన రెండు కిలోల గంజాయిని కూడా ఈ రేకుల షెడ్డులోనే దాచి ఉంచాడని చెప్పారు. వచ్చిన సమాచారం మేరకు రేకులషెడ్డుపై దాడిచేసి నిందితుణ్ని అరెస్టుచేశామని తెలిపారు. గంజాయి, దొంగిలించిన 4 సెల్ పోన్లు, ఒక పర్సనల్ సెల్ ఫోన్, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితుణ్ని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కోర్టు అతనికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. సిఐ జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం, చిట్టివలస జీరిపేట గ్రామానికి చెందిన చిల్లా మాధవరెడ్డి (51) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో తగరపువలస నుంచి చేపల వ్యాపారులు రమ్య, గరగయమ్మలను ఎప్పటిలాగే ఆటోలో తీసుకొని లంకెలపాలెం వెళ్లి చెరువు చేపలు కొనుక్కొని తిరిగి వస్తున్నారు. శనివారం అర్ధరాత్రి మిందివానిపాలెం వద్ద ఆటో టైర్ పంచర్ కావడంతో రోడ్డు పక్కన ఆపిమాధవరెడ్డి టైర్ మార్చుతుండగా పెందుర్తి నుంచి ఆనందపురం వైపుగా వచ్చే సిమెంట్ లారీ (ఎపి16 టిజె 4131) ఆటోతో పాటు మాధవరెడ్డిని కొంత దూరం ఈడ్చుకుపోయింది. లారీ చక్రం కింద పడి మాధవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మాధవరెడ్డి సోదరుడు చిల్లా వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భార్యను హత్య చేసి భర్త పరారైన సంఘటన ఎంవిపి.పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కవానిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన చెల్లూరి సలోమి (28)కి నక్కవానిపాలెంలో నివాసముంటున్న డేనియల్‌తో 2017లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కవల పిల్లలు. రెండు సంవత్సరాలుగా భార్యను అనుమానిస్తూ డేనియల్ వేధిస్తున్నాడు. వారి మధ్య కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. కౌన్సిలింగ్ ఇచ్చినా మార్పు రాలేదు. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున మెడ నులిమి సలోమిని అతడు హత్య చేశాడు. కేసును ఎఎస్ఐ మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే బెల్టుల ప్రదానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

రైయాన్ ర్యూ ఫోటో కాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో నర్సీపట్నం ఆర్పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఎంపికైన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. ఎల్లో బెల్టులు ఏడుగురు, ఆరెంజ్ బెల్టు ముగ్గురు, బ్రౌన్ బెల్టు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ వి.లక్ష్మి

ఉపాధి నిధులతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - విఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామపంచాయతీ పులుసు మామిడి నుంచి అల్లు వాగు వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో డబుల్ బిఎం మట్టి రోడ్డు పనులను ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ వెట్టి లక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వర్షాలు వస్తే వాగు దాటాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉండేదన్నారు. ప్రజల ఇక్కట్లను పరిశీలించి, ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరుచేయించి, పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పులుసు మామిడి, పెద్దమట్టపల్లి గ్రామ ప్రజలకు, రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు చేపట్టి, త్వరితగతిన పూర్చి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పండా బొజ్జి, చిలకం శంకర్, సిపిఎం మండలం కార్యదర్శి సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ తుర్రం బాబురావు, కారం సుందరయ్య, వార్డు సభ్యులు కారం.గంగయ్య, కాలుముల ఈర్మారాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు అమీర్‌బాషా

ప్రజాశక్తి - సీలేరు: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సీలేరు డిఎవి పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్‌కె.అమీర్ భాషా ఎంపికయ్యారని హెచ్ఎం క్రిరణ్ కుమార్ తెలిపారు. ఈనెల 13న విశాఖపట్నం ఉక్కునగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో పాల్గొన్న భాషా, మంచిప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు అమీర్‌భాషాను హెచ్ఎం కిరణ్‌కుమార్‌తోపాటు పిఇటి కమలాకర్, ఉపాధ్యాయులు ప్రశంసించారు. జాతీయ క్రీడల్లో అమీర్ భాషా రాణించి, బంగారు పతకాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని వడ్డుగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇవ్వాల్సిన గుడ్లు, పల్లీ చెక్కీలను అందజేశారు. గోదారి, శబరి వరదలతో ముంపు బారిన పడిన గ్రామాల్లో పాఠశాలలకు సెలవులిచ్చిన నేపథ్యంలో మధ్యాహ్న భోజనం నిలుపుదల కావడంతో విద్యార్థులకు ఇవ్వాల్సిన వీటిని పాఠశాలలు పున:ప్రారంభం నేపథ్యంలో హెచ్ఎం అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్ ముత్యాల సురేష్‌కుమార్, వైస్‌చైర్మన్ రామలక్ష్మి పంపిణీ చేశారు. పాఠశాలలోని 47మంది విద్యార్థుల తల్లిదండ్రులకు కబురుపెట్టి రప్పించి, వాటిని అందజేశారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మాదిగమల్లు, అన్నవరం గ్రామాల్లో భారీ వర్షాలకు ఇళ్లు కొట్టుకుపోయిన నాలుగుబాధిత కుటుంబాలకు తహశీల్దార్ కుమారస్వామి బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మాదిగ ములుగు చెందిన జనం మైన, పడాల్ మంజులత, అన్నవరానికి చెందిన కిముడు మతిరాజు, కిల్లో పాణి కుటుంబాలకు వంట పాత్రలు, 25 కేజీలు చొప్పున్న బియ్యం, నిత్యవసర సరుకులు, కాయగూరలు, దుస్తులు, దుప్పట్లు, అందజేశారు. అలాగే గుమ్మి రేవుల పంచాయతీ పరిధిలో రెండు గ్రామాల్లో వరదలతో నష్టపోయిన నాలుగు కుటుంబాలకు గిరిజన సంఘం నేత మార్క్ రాజ్ సమకూర్చిన బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. బాధితులకు అండగా నిలిచిన మార్క్‌రాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, విఆర్ఓ మంగమ్మ, విఆర్ఎ ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో నిత్యం అవస్థలు

ప్రజాశక్తి- దేవీపట్నం :రెండు మండలాలు మధ్య రహదారి మార్గం... అలాగే అటు మైదాన ప్రాంతం తూర్పు గోదావరిని, ఇటు అల్లూరి జిల్లా ఏజన్సీ ప్రాంత మధ్యన సుమారు మూడు గ్రామాలు నిత్యం వద్ద ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కోరుకొండ రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గం కావడంతో ఈ దారిలో అధికసంఖ్యలోనే వాహన రాకపోకలు సాగుతుంటాయి. అయితే ఇరువైపులా ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆయా గ్రామాల మధ్య రోడ్డు అధ్వాన్నంగా మారి, వాహన చోదకులకు తీవ్ర అవస్థలు పాల్జేస్తోందని వాపోతున్నారు. పట్టణ ప్రాంతాలకు కలిపే మార్గం అయినప్పటికీ, ఈ రోడ్డు దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వాలు మారుతున్నా ఆ రోడ్డును బాగుచేసేందుకు ఎవరూ చర్యలు చేపట్టడం లేదని ఇందుకూరుపేట, గోపాలపురం, ఇంటికాయల పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం వస్తే అడుగడుగునా గోతులతో దుర్భరంగా మారి తీవ్ర అవస్థలు కల్గిస్తుందని అంటున్నారు. . ఇందుకూరుపేట పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్గించే ఈ రోడ్డు మార్గాన్ని మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఇందుకూరుపేట వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

వర్ష నష్టాలపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - సీలేరు: జీకే.వీధి మండలం సీలేరులో ఆదివారం ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం విస్తృతంగా పర్యటించింది. రోహిణి ఇంటిని పరిశీలించారు. దుప్పిలివాడ పంచాయతీ వద్ద వరదలకు కోతకు గురైన వలసగెడ్డ వంతెన తాత్కాలిక పనులు పరిశీలించారు. అనంతరం సచివాలయంలో కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ దుర్జో, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో పంటనష్టాలపై సమీక్ష సమావేశం నిర్వహించి, వివరాలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాయంత్రం తోకరాయి గ్రామపరిధిలో పంటనష్టపోయిన 45 ఎకరాలను ఎంపిడిఓ బృందం పరిశీలించింది. వర్షఉధృతికి బండరాళ్లు, కర్రలు కొట్టుకొట్టి, పంటపొలాల్లో మట్టితో సహా భారీగా పేరుకుపోయాయని బాధితులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపిడిఓ స్పందించి, వర్షం వల్ల కలిగిన పంట, ఇతర ఆస్తినష్టాలపై అంచనా నివేదికలను రూపొందించి, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.పాపారావు, హౌసింగ్ ఎఇ సూరిబాబు, దారకొండ, దుప్పిలివాడ కార్యదర్శులు వాసం. శ్రీనివాస్, వెంకటరావు స్థానిక సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, కూటమి నాయకులు చిటికెల. రాము, సర్పంచ్ నడిగట్ల. రాజు పాల్గొన్నారు.

సోలార్ దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి - మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం పంచాయతీ తడిక వాగు, మల్లవరం గ్రామాలలో హైదరాబాద్‌కు చెందిన జోనల్ అనే స్వచ్ఛంద సంస్థ సోలార్ దీపాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తమౌతోంది. ఆయా గ్రామాల్లో కొన్నాళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత చొరవ తీసుకుని సమస్యను తోటిపెగ పంచాయతీ సర్పంచ్ చంద్రయ్య ద్వారా జోనల్ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన సంస్థ ప్రతినిధులు మల్లవరం గ్రామంలో నాలుగు, తడికి వాగు గ్రామంలో మూడు సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. జోనల్ సంస్థ సభ్యులు రాము, సర్పంచ్‌లు చంద్రయ్య ఆకేటి సీత ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.

సెల్ సిగ్నల్స్ లేక అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: ఇటీవల పెను తుఫాను, వరదల కారణంగా అమ్మోరు దారకొండ గ్రామంలోని ఎయిర్‌టెల్ సెల్ టవర్ సోలార్ ప్లేట్లు ఎగిరిపోవడంతో సెల్ సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. ఆకులూరు, ఎ.దారకొండ మధ్య అటవీ ప్రాంతంలో నిర్మించిన సెల్‌టవర్ గాలులకు ధ్వంసమైనా, ఎయిర్ టెల్ నిర్వాహకులు స్పందించక పోవడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

486 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 400మందికి వైద్యసేవలు అందించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ కార్యాలయ ఇన్‌చార్జి స్వామీ వేదవిద్యానంధ మహారాజ్, మేనేజర్ స్వామీ రఘువీరనంద మహారాజ్ పాల్గొని వైద్య సేవలను పర్యవేక్షించారు. డాక్టర్ బి.రాఘవేంద్రరావు డాక్టర్ నిఖిత పాతూరిచ డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి. డాక్టర్ ఎస్. కె.ఎన్.మణికంఠ డాక్టర్ జి.శృతి, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ .టి.వి.సుబ్బారావు, డాక్టర్ఉమా మహేష్, డాక్టర్ ఎస్. సంపత్ కుమార్, జియస్‌ఎల్.డాక్టర్స్ వైద్యబృందం పాల్గొని రోగులకు సేవలు అందించింది. ఈ సందర్భంగా 122మందికి రక్తపరీక్షలు, 10మందికి థైరాయిడ్ పరీక్షలు 8మందికి ఇసిజిలు, 20మందికి ఎక్స్‌రేలు, ఎనిమిది మందికి ఫిజయోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు. వేమాగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించి 86 మందికి కంటి పరీక్షలు చేశారు. 25మందికి కళ్లజోళ్లు, ఆరుగురిని కంటి ఆపరేషన్లు అవసమరి గుర్తించి వేమగిరికంటి ఆసుపత్రికి తరలించారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ ఎల్‌జి.బి.భగిరథ రాజు.రాము, మంగిరెడ్డి చంద్రరావు వెంకటలక్ష్మి, కె. రమాదేవి మల్లికార్జున రావు, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు, శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పులి సంతోష్ కుమార్

శ్రీరామగిరిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ కేంద్రంలో ఆదివారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేట్టారు. సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల వరదలతో మురుగుకాలువలు, రోడ్లపై పేరుకుపోయిన బురద, వ్యర్థాలను శుభ్రం చేశారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్. పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ. నెల రోజులుగా వర్షాలు, గోదారి, శబరి వరదలతో అవస్థలు పడ్డ ప్రజలు ఇప్పుడిప్పుడే గ్రామాలకు చేరుకుంటున్నారన్నారు. దీంతో బాధిత గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించివ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిచల.దుర్గారావు, మాజీ ఉపసర్పంచ్ గుండిపూడి.లక్ష్మణరావు, వార్డు నెంబర్ పూసం రవివర్మ, అత్మకూరి కాంతారావు, నాళ్ళారప చందరావు, గ్రామస్తులు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని దోసరపం గ్రామంలో ఆదివారం బైక్‌పై వెళుతున్న వారిని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు, పోలీసులు కథనం ప్రకారం దోసరపాము గ్రామానికి చెందిన మరిసే బాబూరావు (68)చ సత్యనారాయణ అనే ఇరువురు టీవీఎస్ మోపెడ్‌పై రాజవొమ్మంగి వైపు వస్తుండగా, మోపెడును అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ వెనక నుండి ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు, మెరుగైన వైద్యం కోసం ఇరువురిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, బాబూరావు మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి, రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్ వెంకయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందుకూరుపేట హెచ్ఎం మృతి

ప్రజాశక్తి- దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుకొమరం ధర్మన్న దొర శనివారం మృతి చెందారు. రెండు కిడ్నీలు చెడిపోవటంతో కొంతకాలంగా డయాలసిస్ చేయుంచుకుంటున్న ధర్మన్నదొర మృతితో ఆయన స్వగ్రామం పాముగండిలో విషాద ఛాయలు అలముకున్నాయి. ధర్మన్నదొర మృతికి ఆయన క్లాస్‌మేట్ ఎంఇఒ సిరసం బాలుదొరతోపాటు పలువురు సంతాపం ప్రకటించారు.మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు

గిరిజన సంక్షేమంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి : గిరిజన సంక్షేమంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌సి,ఎస్‌టి హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికముక్కు సుబ్బయ్య అన్నారు ఆదివారం మండలంలోని జడ్డంగి గ్రామంలో కార్యకర్తల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ వేదిక అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కొంగర బాబ్జి ధోరణి నియమిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజనులు, దళితులకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తేవాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసానిచ్చారు. గిరిజనుల ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై వేదిక ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నామన్నారు. గిరిజన ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలను పాటిస్తూనే గిరిజనులుగా కొనసాగడానికి అర్హులన్నారు. కార్యక్రమంలో కొంగర మురళీకృష్ణ, తాము సూరిబాబు, గంప నాగరాజు, జెఎసి లీగల్ కన్వీనర్ చిలకమూర్తి విశ్వనాథరెడ్డి, జోడి శివకృష్ణ, శ్రీవల్లి ధర్మేష్ ప్రసాద్ కుమార్ సింగిరెడ్డి మల్లికార్జునరావు పాపారావు నానాజీ సూరిబాబు రాంబాబు పాల్గొన్నారు.